పెళ్లి ఉచ్చులో బాల్యం బందీ!

- కొనసాగుతున్న బాల్య వివాహాలు
- తల్లిదండ్రుల్లో కొరవడిన చైతన్యం


బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

- ఉరవకొండ నియోజకవర్గంలోని ఒక గ్రామంలో 14 ఏళ్ల అమ్మాయికి యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. ప్రేమ, పెళ్లి వ్యవహారంలో తలెత్తిన వివాదం అమ్మాయి ఇంటి గుమ్మం వద్దే అందరూ చూస్తుండగా గత నెలలో తాళి కట్టాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఐసీడీఎస్, బాలల సంరక్షణ సమితి, పోలీస్ అధికారులు హుటాహుటిన బాలిక స్వగ్రామానికి చేరుకుని ఆరా తీశారు. బాల్య వివాహంగా నిర్ధారించి తాళి కట్టిన యువకుడిపై కేసు నమోదు చేశారు.
- బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల అమ్మాయితో 28 ఏళ్ల అబ్బాయికి గత ఏడాది కర్ణాటకలోని ఓ దేవాలయంలో తల్లిదండ్రులు ఆధ్వర్యంలోనే పెళ్లి చేశారు.
- రాయదుర్గం మండలంలోని ఓ గ్రామంలో 15 ఏళ్ల అమ్మాయికి అదే గ్రామానికి చెందిన 21 ఏళ్ల అబ్బాయితో ప్రేమ వివాహం జరిగింది. ఇరువురి ఇంట్లో ఒప్పించి ప్రేమ పెళ్లి చేసుకున్నట్లు సమాచారం.
- డి.హీరేహాళ్ మండలంలోని 16 ఏళ్ల అమ్మాయికి 23 ఏళ్ల అబ్బాయితో పెళ్లి సంబంధం అమ్మాయి తల్లిదండ్రులు కుదిర్చారు. ఆంధ్రాలో పెళ్లి జరిగితే అధికారులు నుంచి ఇబ్బందులు వస్తాయని కర్ణాటకలోని బళ్లారికి వెళ్లి వివాహం చేసుకొచ్చారు.

బొమ్మనహాళ్: బాల్య వివాహాల పట్ల అవగాహన లేని తల్లిదండ్రులు చిన్నతనంలోనే పిల్లలకు వివాహం చేసి భారం దింపుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వాటిని అరికట్టాల్సిన అధికారులు నామమాత్రంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారులకు గుట్టుచప్పుడు కాకుండా ఊరు దాటించి మరీ బాల్య వివాహాలు చేస్తున్నారు. ఇటీవల కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజవర్గాల్లోని వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో సుమారు వందకు పైగా బాల్య వివాహాలు జరిగాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లలంటే ఇప్పటికీ భారంగానే భావిస్తున్నారు. చదువుకునే వయస్సులో జీవితంపై అవగాహన ఏర్పడకుండానే పెళ్లి చేసి వారి ఆశలను చిదిమేస్తున్నారు. సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో 18 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి అంటూ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. ఫలితం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. నియోజకవర్గ పరిధిలో ఏటా 30కి పైగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు అంచనా. అవగాహన లేమి, ఆర్థిక సమస్యలు, మూఢ నమ్మకాలు, అభద్రతా భావం, బాలికలను చదివించే స్థోమత లేకపోవడం తదితర కారణాలు బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నాయి.

ఐసీడీఎస్ పాత్ర కీలకం..

బాల్య వివాహాలను అరికట్టడంతో ఐసీడీఎస్‌దే కీలక పాత్ర. 11 నుంచి 18 ఏళ్లలోపు కిషోర బాలికల జాబితా అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డుకోవాలి. అయితే అధికారులు తమ దృష్టికి వచ్చిన ఒకటి రెండు వివాహాలను అడ్డుకున్నా గుట్టుచప్పుడు జరుగుతున్న బాల్యవివాహాలు ఎన్నో ఉన్నాయి. చట్టం ప్రకారం అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేయాలి. దీనిని ఉల్లంఘించిన వారికి బెయిల్ లభించని నేరంగా పరిగణిస్తారు. రెండేళ్ల జైలు శిక్షతో పాటు వివాహాన్ని రద్దు చేస్తారు. బాల్య వివాహాల సమాచారాన్ని అందించిన వారి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతారు.

బాల్య వివాహాలు నేరం



బాల్య వివాహాలు నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నాం. బాల్య వివాహం చేస్తే ఎంత నేరమో వివరిస్తూ చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. కుటుంబ సమస్యలు వల్ల తల్లిదండ్రులు తమ చిన్నారులను పెళ్లి ఉచ్చులో పడేస్తున్నారు. బాల్య వివాహాల కారణంగా తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహిస్తోంది.
– యల్లమ్మ, ఐసీడీఎస్, ప్రాజెక్ట్ డైరెక్టర్, కణేకల్లు

మా దృష్టికి తీసుకు రండి



బాల్యవివాహాలు చేస్తే సహించేది లేదు. అలాంటి సంఘటనలు ఎక్కడైనా జరుగుతుంటే సమాచారం అందించండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. చిన్నారుల తల్లిదండ్రులతో పాటు వివాహానికి సంబంధించి ప్రధాన పాత్రధారులపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.
– శ్రీనివాసులు, తహసీల్దార్, బొమ్మనహాళ్

క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

శెట్టూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ యువరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం కేసుల్లో పట్టుబడిన 25 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు వేలం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి'

కూడేరు: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ తులసీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జాబ్ కార్డు ఉండి ఉపాధి పనులకు రాకపోతే.. జాబ్ కార్డును ఉన్నతాధికారులు రద్దు చేస్తారన్నారు.

తలసీమియా చిన్నారికి పింఛన్ అందజేత


చిన్నారి ప్రేమకు రూ.10వేల పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మప్రియ

ఉరవకొండ: గత కొన్ని నెలలుగా తలసీమియా వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని మహావీర జైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదేళ్ల చిన్నారి ప్రేమకు ఆదివారం అక్కడకే వెళ్లి రూ.10 వేల పింఛన్‌ను పెద్ద కౌకుంట్ల సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మప్రియ అందజేశారు. మండలంలోని చిన్నకౌకుంట్ల గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, ఆమనిల కూతురు తలసీమియా వ్యాధి సోకి బెంగళూరులో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం చిన్నారికి రూ.10వేల పింఛన్ మంజూరు చేసింది. దీంతో చిన్నారి చికిత్సకు ఎలాంటి ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతో వెల్ఫేర్ అసిస్టెంట్ బెంగళూరుకు వెళ్లి చిన్నారికి పింఛన్ నగదు అందజేశారు

16వ సామాజిక తనిఖీకి సమాయత్తం

వజ్రకరూరు: మండలంలో ఉపాధి పథకానికి సంబంధించి 16వ సామాజిక తనిఖీకి అధికారులు సమాయత్తం అవుతున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల వ్యాప్తంగా ఉపాధి పథకం కింద వివిధ పనుల నిమిత్తం రూ.8 కోట్ల మేర ఖర్చు పెట్టినట్లు ఏపీఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. మరో రెండు రోజుల్లో సామాజిక తనిఖీ బృందం మండలానికి రానున్న నేపథ్యంలో రికార్డులు సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్న మయ్యారు. ఏపీఓతోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు రికార్డులు సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి వేడుకలు


రేణుకాచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న జంగమ సంక్షేమ సభ్యులు

ఉరవకొండ: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆది జగద్గురురేణుకాచార్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేణుకాచార్యుడి చిత్రపటాన్ని ఊరేగించిన అనంతరం అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. రేణుకాచార్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడుగుండిబండయ్య మాట్లాడుతూ రేణుకాచార్యుల సూక్తులను ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాచపయ్యస్వామి, బూషేంద్రస్వామి, శ్రీకంఠం, విజయ్‌కుమార్,రాజేష్, నటరాజు, సూర్యప్రకాష్, హంపయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించండి

రాయదుర్గం రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్‌పై గ్రామాల్లోని ఓటర్లకు సోమవారం అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కొండయ్య మండలస్థాయి అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గత శుక్రవారం అవగాహన పొందిన పంచాయితీ కార్యదర్శులు , వెల్ఫేర్ అసిస్టెంట్లు , ఉపాధ్యాయులు తమ తమ పరిధిలో ఉన్న పట్టభద్రుల ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా విలువైన ఓటు హక్కును సద్వినియోగం అయ్యేలా చేయాలని ఆయన ఆదేశించారు.

అర్హులందరికీ ఇళ్ల మంజూరు

వజ్రకరూరు: అర్హులైన పేదలందరికీ ఇల్లు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ చెన్నా రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థలం ఉండి ఇళ్లు మంజూరు కాని లబ్దిదారులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వెంటనే ఇంటి కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం


పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ


ఉరవకొండ: రంగావీధిలో ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెండేయస్వామి ఆలయం పక్కన ఉన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో పార్టీ ముఖ్యనేతలు, సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేసి పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ప్రచారానికి కేవలం ఐదు రోజులు మాత్రమే ఉందన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తెచ్చే బాధ్యత తీసుకొని, ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, బసవరాజు, ఎంపీపీ చంద్రమ్మ, సచివాలయ కన్వీనర్లుతేజోనాథ్, ఆసీఫ్, ఉపసర్పంచ్ వన్నప్ప, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించండి..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం మండలంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లతో కలసి ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పెన్నహోబిళం కమిటీ మాజీ అధ్యక్షుడు అశోక్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు సాధు కుళ్లాయిస్వామి, వాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ రఘురాములు, పామిడి సలీం, అన్వర్, శర్మాస్ పాల్గొన్నారు.

వీరశైవుల అభ్యున్నతికి కృషి: విప్ కాపు


వీరశైవుల సముదాయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: వీరశైవ లింగాయత్‌ల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, అందరు ఏకతాటిపై నడిచి ప్రయోజకులుగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని కోట ముఖ ద్వారం ఎదుట బసవేశ్వర దేవాలయం వద్ద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సముదాయ భవనాన్ని ఆదివారం విప్ ప్రారంభోత్సవం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుల సంఘం నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు.. భక్తుల సౌకర్యార్థం కోసం సముదాయ భవన నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో మరింత మేలు చేకూర్చేలా సహకారం అందజేస్తానన్నారు. అనంతరం విప్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట జెడ్పీటీసీ పీఎస్ మహేష్, కమిటీ చైర్మన్ రాజకుమార్, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, కౌన్సిలర్లు బనాపురం మంజు, హెచ్.వన్నూర్‌స్వామి, కో–ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, పీఎస్ మల్లికార్జున, ఆర్‌టీ కాంతారెడ్డి, చందన రామాంజనేయులు, కృపాకర్ పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


రాయదుర్గం: ఓటు అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తదితరులు


వజ్రకరూరు: పీసీ.ప్యాపిలిలో ప్రచారం నిర్వహిస్తున్న వై.భీమిరెడ్డి తదితరులు

రాయదుర్గం: రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప కోరారు. ఆదివారం పట్టణ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ప్రచారం విస్తతంగా చేపట్టారు. నేసేపేట చైర్‌పర్సన్‌తో పాటు చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చుంచుల నాగప్ప, కౌన్సిలర్లు కొంతెం దేవరాజు, పొరాళ్ల గోవిందరాజులు, తట్టీ మంజు, వార్డు ఇన్‌చార్జులు శివప్ప, పొరాళ్ల శివ, నజీర్, వైజాగ్ రిజ్కా, దివాకర్, గోరంట్ల సత్యనారాయణ, వైజాక్ రవి ప్రచారం చేశారు.

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం వివిధ గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్ల వద్దకెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, లోకేష్ రెడ్డి, బోయ నాగరాజు, రవి పులచెర్ల, పుల్లంపల్లి, గోవులాపురం గ్రామాల్లో ప్రచారం చేశారు.

కుందుర్పి: ఎనుములదొడ్డి, కుందుర్పి గ్రామాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి,ఉ రామచంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ బీజప్ప, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచులు మహదేవమ్మ, మూరుతేశ్వరి, సచివాలయాల మండల కన్వీనర్ రాము, నాయకులు బొమ్మలింగ, విజయ్, రామూర్తి పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని పీసీ పెద్దప్యాపిలి, పీసీ కొత్తకోట, పీసీ చిన్నప్యాపిలి, పీసీ ప్యాపిలి తాండా, రాగులపాడు, కడమలకుంట తదితర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.భీమిరెడ్డి ప్రచారం చేపట్టారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిప్పయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథరెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, బోరంగి ఆంజినయ్య, చుక్కారాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు


చిన్నహోతురులో ప్రారంభానికి సిద్ధంగా గ్రామ సచివాలయం


గడేహోతురులో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

వజ్రకరూరు: మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామాల్లో శాశ్వత గ్రామ సచివాలయాలతోపాటు రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలో 14 గ్రామ సచివాలయాలున్నాయి. అన్ని గ్రామాల్లో గ్రామ సచివాలయ నిర్మాణ పనులు వేగంగా చేపట్టారు. గంజికుంట, తట్రకల్లు, చాబాల గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణాలు పూర్తై సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చిన్నహోతురు, గడేహోతూరులో నిర్మాణాలు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వజ్రకరూరు, వెంకటాంపల్లి, రాగులపాడు, పీసీ. ప్యాపిలి, కొనకొండ్ల, గూళ్యపాళ్యం తదితర గ్రామాల్లో సచివాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే గంజికుంట, వజ్రకరూరు, రాగులపాడు, వెంకటాంపల్లి, పీసీ ప్యాపిలి, చిన్నహోతురు, గడేహోతురు, చాబాల, కొనకొండ్ల, గూళ్యపాళ్యం తదితర గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల వద్దకే తీసుకువెళ్లాలన్న మంచి సంకల్పంతో సీఎం వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండువేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్థాయిలోనే ప్రజలకు నేరుగా సంక్షే మపథకాలు అందుతున్నాయని మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆకతాయిల ఆగడాలు


గౌడ లేఔట్ వద్ద ఓ ఇంటి ఆవరణలోకి విసిరిన బీరు సీసాలు

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డు, గౌడలేఔట్, రైల్వేస్టేషన్, జూనియర్ కళాశాల మైదానం పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మద్యానికి బానిసైన యువకులు జన సంచారం లేని ప్రాంతాలను ఆవాసం చేసుకుని పెట్రేగిపోతున్నారు. తొమ్మిదో తరగతి చదివే కొందరు విద్యార్థులు ఇటీవల గంజాయి సిగరెట్లు, మద్యం తాగుతూ సమీప నివాస గృహాల వారికి పట్టుబడ్డారు. మంచి పద్ధతి కాదని హెచ్చరించిన వారి ఇళ్లను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. రెండు రోజుల క్రితం తమ ఆగడాలకు అడ్డుచెపుతున్నారనే ఆక్రోశంతో రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటిని లక్ష్యం చేసుకుని రాళ్లు, మద్యం బాటిళ్లను విసిరారు. ఆ శబ్దానికి తలుపులు తీసేందుకు సైతం వణికిపోయారు. ఆకతాయిల ఆగడాపై చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గస్తీ నిర్వహించాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదు. అర్బన్ పీఎస్‌లో ఇలాంటి ఫిర్యాదులకు దిక్కులేకుండా పోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరాచ గ్యాంగ్‌లను ముందే పసిగట్టి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

పత్తిలో గులాబీ పురుగు నివారణకు చర్యలు

బొమ్మనహాళ్: పత్తి పంటను ఆశిస్తున్న గులాబీ పురుగు నివారణకు రైతులు మందుస్తు చర్యలు చేపట్టాలని ఏఓ అహమ్మద్ బాషా సూచించారు. ఆదివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తిలో బీటీ రకాలు, నాన్ బీటీ రకాలను కలిపి నాటకపోవటం, దీర్ఘకాలిక రకాలు (150 రోజులకు పైగా) సాగు చేయటం, పంటను ఫిబ్రవరి నెల తరువాత కూడా కొనసాగించటం వంటి తప్పిదాలతో గులాబీరంగు పురుగు ఆశిస్తుందన్నారు. పంట పూర్తయిన తరువాత పత్తి పంటను గొర్రెలు, మేకలు పూర్తిగా తినేలా చేయాలన్నారు. పత్తి తీత పూర్తయిన రోటావేటర్‌తోగాని షడ్డర్‌తోగాని మొదళ్లను నుసి చేసి పొలంలో కలియదున్నాలన్నారు. పత్తి కట్టెలను వంట చెరుకుగా వాడొద్దన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం: 1994–1997 బ్యాచ్‌కు సంబంధించి డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ అనంతరం అందరూ వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. చాలా రోజుల తర్వాత అందరూ ఒక చోట కలసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.అనంతరం అప్పటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

నేడు మంత్రి పర్యటన

శెట్టూరు: మండల కేంద్రలో సోమవారం మంత్రి ఉషశ్రీచరణ్ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజనాథ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉపాధ్యాయులు, పట్టబద్రులను కలిసి ఓటు అభ్యర్థించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి పప్పుశనగ కొనుగోలు

విడపనకల్లు: మండల కేంద్రంలో సోమవారం నుంచి విడపనకల్లు,పెద్ద కొట్టాలపల్లి సొసైటీల ఆధ్వర్యంలో పప్పుశనగ, జొన్న కొనుగోలు చేస్తున్నట్లు విడపనకల్లు సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పప్పుశనగ, జొన్న సాగు చేసిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటాల్ పప్పుశనగ ధర రూ.5,330, జొన్న క్వింటాల్ రు.2,999లు మద్దుతు ధరతో నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

స్టార్టర్, కేబుల్ చోరీ

కూడేరు: మండలంలోని అంతరగంగకు చెందిన రైతు కురుబ సిద్ధప్ప పొలంలో మోటార్‌కు అమర్చిన స్టార్టర్, కేబుల్ శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం రైతు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లగా దొంగతనం జరిగనట్లు గుర్తించాడు. దాదాపు రూ.10వేలు నష్టపోయాయని బాధిత రైతు వాపోయాడు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా రెండు నెలల క్రితం అంతరగంగలోనే ఓ రైతు పొలంలో స్టార్టర్ పెట్టె, నెల క్రితం కూడేరులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పెద్దమ్మ ఆలయంలో హుండీలో నగదు చోరీకి గురయ్యాయి. రెండు రోజులు క్రితం చోళసముద్రం గ్రామంలో బస్టాండ్ దగ్గర నివాసమున్న వ్యక్తి ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. రాత్రివేల పోలీసులు గస్తీ నిర్వహించి చోరీలు చోటు చేసుకోకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న గదులు

కూడేరు: ఎంపీడీఓ కార్యాలయ భవనం పాతబడి ఒక భాగం పూర్తిగా దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉంది. భవనం వెనుక వైపు గోడలు చీలాయి. శిథిలావస్థకు చేరుకున్న గదుల్లో ఉపాధి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. పైకప్పులు పూర్తిగా దెబ్బతిని చిన్నపాటి వర్షం వచ్చిన వర్షం నీరు కిందికి దిగుతోంది. దీంతో రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు కూర్చొనే గది పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న గదిలో విధులు నిర్వర్తించడానికి ఉపాధి సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని సిబ్బంది, ఉపాధి కూలీలు కోరుతున్నారు.

నేడు ఇరుసు, రాతిగుండు పోటీలు

యాడికి: శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా సోమవారం ఉదయం 9 గంటలకు రాతి గుండు, ఇరుసు పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న కీడాకారులు రూ.100 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 24 పాకెట్ల (ఒక్కొక్కటీ 50 కేజీలు) రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఆదివారం మండల కేంద్రంలోని కోన రోడ్డులో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి బియ్యం తరలిస్తున్న శివ, అనిల్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన



అనంతపురం క్రైం: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో చేనేత వస్తువులను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఎగబడ్డారు. కొండపల్లి బొమ్మలు, ఖాదీ షర్ట్స్, సహరన్‌పూర్ ఫర్నీచర్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, హైదరాబాద్ పెరల్స్, శారీస్, మైసూర్ పెయింటింగ్స్, ఫ్లవర్స్, ఇంటికి శోభనిచ్చే హస్తకళా బొమ్మలు, ఇలా వేలాది వెరైటీలను ప్రదర్శనలో ఉంచారు.